17 వ
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
గురువారం,8 ఆగస్టు 2024


# ఆగి ఉన్న మోటారు సైకిల్‌ను కారు ఢీకొట్టడంతో మహిళ మృతి

-యువకుడికి తీవ్ర గాయాలు -వైసీపీ నాయకుడి నిర్వాకం




**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** మొగల్తూరు రోడ్‌లోని ఓ రెస్టారెంట్ సమీపంలో మండలంలోని చిట్టవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కోళ్ల శ్రీనివాస్ ఆగిఉన్న మోటార్ సైకిల్ ను కారుతో బలంగా ఢీకొట్టడంతో ఒక మహిళ మృతి చెందింది. అదే వాహనంపై ఉన్న యువకుడు గోరింకల ఆలీ వర్ కు రెండు కాళ్లు విరిగిపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మెడికల్ షాప్‌లో మందులు తీసుకునేందుకు ఆగి ఉన్న టు వీలర్ ను వెనక నుండి వచ్చి కారుతో బలంగా ఢీకొట్టడంతో మంగళ గుంట పాలెంకు చెందిన మేక మేరీ బాయ్(58) ప్రమాద స్థలంలోనే మృతి చెందింది. అక్కడే ఆగి ఉన్న నాలుగు వాహనాలు కూడా ప్రమాదంలో పాడయ్యాయి.నిందితుడు కోళ్ల శ్రీనివాస్ వెంటనే పోలీసులకు లొంగిపోయాడు. ప్రమాద స్థలానికి ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.తాగిన మైకంలో ఓవర్ స్పీడ్‌తో రాంగ్ రూట్లో వచ్చి బైకును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# గంజాయి,డ్రగ్స్ వినియోగంపై ఉక్కుపాదం

**అమ్మకం, వినియోగంపై ప్రత్యేక నిఘా**

**ఫిర్యాదులు చేసేందుకు 14500 టోల్ ఫ్రీ నెంబర్**




**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదంమోపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్లో గౌతమీ సమావేశపు హాలులో బుధవారం మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.ఈసందర్భంగాకలెక్టర్‌వెట్రిసెల్వి మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల రవాణా,వినియోగంపై అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలనీ, గంజాయి, డ్రగ్స్ రవాణా ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, హైవేలలో టోల్ ప్లాజాల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడాగంజాయి,డ్రగ్స్‌వినియోగం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని,డ్రగ్స్ పంపిణీ చేసే పెడ్లర్స్‌ను గుర్తించి వారిపై కఠిన కేసులు నమోదు చేయాలన్నారు. డ్రగ్స్ సరఫరా, వినియోగం కూడా శిక్షార్హమేనని, గంజాయి,డ్రగ్స్ వినియోగం కలిగే దుష్ప్రభావాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.డ్రగ్స్‌సరఫరాపై14500 టోల్ ఫ్రీనెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. 14500 టోల్ ఫ్రీ నెంబర్‌ను అన్ని పాఠశాలలు, కళాశాలల్లోని, ప్రముఖ రోడ్ల కూడళ్ళ ప్రదర్శించాలన్నారు.పోలీస్,విద్య, మెడికల్, అధికారులతో ప్రత్యేక బృందంగా ఏర్పాటుచేసి పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్‌వంటి మాదకద్రవ్యాలవినియోగంవలనకలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన శిక్షలుపై విస్తృత అవగాహనకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, నాటు సారా అమ్మకాలు,రవాణాపై పెద్దఎత్తున నిఘాపెట్టామన్నారు.

స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 149 కేసులు నమోదు చేయడమైనది, 540 మందిని అరెస్ట్‌చేయడం జరిగిందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి దామా, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, జిల్లా రెవిన్యూ అధికారి డి.పుష్పమణి, డిఈఓ అబ్రహం,ఆర్ఐఓ చంద్రశేఖర్, ఉపరవాణా కమీషనర్ శాంతికుమారి, డిసిహెచ్ ఎస్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.నాగేశ్వరరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాలలో చేరికలపై అవగాహన

**పేద విద్యార్థులకు ఫీజు తానే చెల్లిస్తానని**

**జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రకటన**



**భీమవరం,మేజర్‌న్యూస్:** జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరికలకు విద్యార్థులలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తాడేపల్లి గూడెం పాలిటెక్నిక్‌కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యాశాఖ అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడనాగరాణిమాట్లాడుతూపాలిటెక్నిక్ విద్యాభ్యాసంద్వాంఅవకాశాలు, వనగూరే ప్రయోజనాలపై విపులంగా విద్యార్థులకు అవగాహనకల్పించాలన్నారు.పాలిటెక్నిక్ కళాశాలలో చేరికలు తక్కువగా ఉండడంపై సంబంధిత అధికారులపై కలెక్టర్ అసహనాన్ని వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్‌లో సివిల్ బ్రాంచ్ విద్య ద్వారా టాటా, ఎల్అండ్‌టి, మెగా వంటి సంస్థలలో మంచి వేతనంతో అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. మల్టీ నేషనల్ కంపెనీలలో అవకాశాలు ఉన్న,వారి అవసరం మేరకు సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ వంటి పాలిటెక్నికల్ కోర్సులు చదివిన విద్యార్థులను అందించలేక పోతున్నామన్నారు. పాలిటెక్నికల్ చదివితే 20 సంవత్సరాలలోపేమంచిజీవితంతో ఉద్యోగంలో స్థిరపడడం కచ్చితంగా ఉందని ఈ విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నా రు. ఇంటర్మీడియట్ విద్య అభ్యసించాలంటే లక్షల్లో ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని, పేద మధ్యతరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్‌విద్యతక్కువ ఫీజు రూ.5 వేలతో అందుబాటులో ఉందన్నారు. పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం ద్వారా ప్రయోజనం విస్తృతంగా ఉందని, ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా బీటెక్ చదువు కోవ డానికి ఆయా కంపెనీలు అవకాశాలను ఇస్తున్నాయని ఈ సందర్భంగా తెలిపారు.పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడానికి ముందుకు వచ్చే పేద విద్యార్థులకు ఫీజును తానే స్వయంగా చెల్లిస్తానని కలెక్టర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈ సందర్భంగా తెలిపారు.

విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని రానున్న పది రోజుల్లో పాలిటెక్నిక్ కళా శాలలో చేరికలను పెంచేందుకు కార్యాచరణ రూపొందించుకుని అమలు చేయాలన్నారు. మనం పిల్లల కోసం, ఉత్తమ సమాజ నిర్మాణం కోసం పనిచే యాలని ఈ సందర్భంగా హితవు పలికారు.ఈ సమావేశంలో తాడేపల్లి గూడెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఫణీంద్ర ప్రసాద్, మెకానికల్ బ్రాంచ్ హెడ్ శివప్రసాద్, సివిల్ బ్రాంచ్ హెడ్,ఎస్.ఎస్.ఎ పిఓ పి.శ్యాంసుందర్, డీఈఓ ఆఫీస్ ఏడి ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలి

**జడ్పీ సీఈఓతో ఎమ్మెల్యే బొలిశెట్టి**



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** గత ఐదు సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరైన తాగునీరు అందించడంలో కూడా వైసీపీ ప్రభుత్వం విఫలమైందని కూటమి ప్రభుత్వంలో ఆ సమస్య తలెత్తకుండా గ్రామాల్లో పూర్తిస్థాయిలో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేయాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు.తాడేపల్లిగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం బొలిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిసిన జడ్పీ సీఈవో కెవిఎస్ సుబ్బారావుతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా మంచినీటి అవసరాలను గుర్తించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నిధుల కోసం అవసరమైతే తాను స్వయంగా ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌ని కోరి సమీకరిస్తామన్నారు. మంచినీరు అందించడంలో ఎలాంటి అలసత్వం వహించవద్దనిఆర్డబ్ల్యూఎస్ అధికారులకుఆయనఈసందర్భంగా సూచించారు. ముందుగా జడ్పీ సీఈవో సుబ్బారావు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈలు, తాడేపల్లిగూడెం ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## చేనేతకు ఎంతో చారిత్రక నేపథ్యం

**ఆర్డీవో అచ్యుత అంబరీష్**




**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** నరసాపురం ప్రాంత చేనేత వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్నదని, దానిని కాపాడేందుకు అందరూ కృషి చేయాలని ఆర్డిఓ అచ్యుత అంబరీష్ అన్నారు.బుధవారంమండలంలోని రుస్తుం బాధ పంచాయతీలో గల ఐఎల్‌టిసిలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఈపీహెచ్ కన్వీనర్ కలవకొలను నాగ తులసీరావ్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ ఇటలీ దేశంలో అప్పటి రోమన్ ప్రభుత్వంలో కూడా భారతదేశ చేనేత వస్త్రాలను వినియోగించారని, ఆధునీకరణ, నూతన ఆలోచనల వల్ల ఉత్పత్తి, ఎగుమతులు తగ్గి చేనేత పరిశ్రమ ఇబ్బందులను ఎదుర్కొంటున్నదని ఆయన అన్నారు. నరసాపురం ప్రాంత లేసు అల్లికలకు జియో లాజికల్ గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. బంగ్లాదేశ్, వియత్నాం లాంటి చిన్న దేశాలు వస్త్ర పరిశ్రమలు అభివృద్ధి అయ్యాయని, భారత చేనేతకు మరింత గుర్తింపు వచ్చేలా వినియోగదారులు, ఉత్పత్తిదారులు కృషి చేయాలని అన్నారు. అనంతరంపలువురు చేనేత కార్మికులనుసత్కరించారు. కల్వకొలను తాతాజీ, మా ఊరు సత్యనారాయణ, అడ్డగల సాయిబాబా తదితరులు మాట్లాడగా, మాదాసు గోపాలకృష్ణ, అడ్డ గళ్ళ బాబు, పులపర్తి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

### ముదినేపల్లి తాహసిల్దారుగా జెఎస్ సుభాని బాధ్యతలు స్వీకరణ



**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** ముదినేపల్లి మండలం తహసిల్దారుగా జేఎస్ సుభాని బాధ్యతలు స్వీకరించారు. మండవల్లి తహసిల్దార్‌గా సమర్థవంతంగా ఎన్నికలవిధులు నిర్వహించి బదిలీపై ముదినేపల్లి తాహసిల్దార్ కార్యాలయానికి వచ్చారు తాహసిల్దార్ జెఎస్ సుభానిని కార్యాలయ సిబ్బంది,వీఆర్వోలు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

# మైనర్ బాలికపై దాడి, అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

**– జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ వెల్లడి**





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లా నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గ్రామంలో 5 సం.ముల మైనర్ బాలికపై ఈనెల 4వ తేది న ఒక వ్యక్తి యింటిలో సుమారు రాత్రి 9.30 గంటలసమయంలో తన కుటుంబ సభ్యులతో కలిసి తనఇంటివరండాలో నిద్రించుచుండగా ముద్దాయి పసి పాపపై అత్యాచారం, దొంగతనం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.ఈ సమాచారాన్ని రాత్రి 2.30 నిమిషాలకు అందుకున్న వెంటనే 2.45 నిమిషాలకు పోలీసులు వారు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.ఈ కేసులో మైనర్ బాలిక అవ్వడం వలన ముద్దాయి సమాచారం ఏమీ తెలియకపోయినా,ఏ విధమైన క్లూస్ లేనటువంటి కేసును ఛాలెంజ్‌గా తీసుకొనిపోలీసులు చేధించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వెంటనే జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ అనుభవజ్ఞులైనటు వంటి అధికారులతో నాలుగు టీములను ఏర్పాటు చేశారు.అధికారులు ముద్దాయి వివరాలను సేకరించడం కొరకు డీఎస్పీ ఆధ్వర్యంలో ఒకటి టీం, భీమడోలు సిఐ ఆధ్వర్యంలో ఒక టీం, నిడమర్రు సిఐ ఆధ్వర్యంలో ఒక టీం, నూజివీడు సిఐ ఆధ్వర్యంలో మరొక టీం నియమించి జిల్లా వ్యాప్తంగా ముద్దాయి కొరకు జల్లెడ పట్టారు. ముద్దాయిని గురించి 3.00 గ.లకు గుంటూరు జిల్లా అధికారులకు, పల్నాడు జిల్లా అధికారులకు ఏలూరు జిల్లాలో అధికా రులు ముద్దాయిని గురించి అప్రమత్తం చేశారు. ముద్దాయి వివరాలను సేకరించుట కొరకు డాగ్స్ స్క్వాడ్, క్లూస్ టీమును సంఘటన స్థలానికి చేరి వెంటనే ముద్దాయి ఆధారాలను సేకరించడం కొరకు అధికారులు దర్యాప్తు కొనసాగించారు.గుంటూరు జిల్లా ఎస్పీ, పల్నాడు జిల్లా ఎస్పీ సహాయ సహకారాలతో ముద్దాయి వివరాలను అధికారులు తెలుసుకొని ముద్దాయి మిరియాల జయ రావు, తండ్రి పేరు పెద్ద రామయ్య, 33 సం.లు, కుమ్మరి కోట గ్రామము, రెంటచింతల మండలం, పల్నాడు జిల్లా అని సమాచారం అందించారు.నాలుగు బృందాలలోని అధికారులు వెంటనే ముద్దాయి వివరాలను గురించి త్వరితగతిన సమాచారాన్ని సేకరించి ముద్దాయి అరెస్టు చేసిన ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగం. ముద్దాయి మిరియాల జయ రావు, తండ్రి పేరు పెద్ద రామయ్య, 33 సం.లు,కుమ్మరికోటగ్రామము, రెంటచింతల మండలం, పల్నాడు జిల్లా అనే అతను గతములో రెంటచింతల గ్రామంలో ఇటువంటి నేరానికి పాల్పడినట్లు, ఎంత త్వరగా అరెస్టు చేసామో, అంతా త్వరగా ఛార్జ్ షీట్ ఫైల్ చేసి అంత త్వరగా కోర్టులో త్వరగా శిక్ష పడేల చూస్తామని జిల్లా ఎస్పీ శివ ప్రతాప్ కిషోర్ వెల్లడించారు. జిల్లాలో గతములో ఇటు వంటి నేరాలకు పాల్పడిన ముద్దాయిల వివరాలను సేకరించినట్లు వారిపై కూడాఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరగా శిక్షలు పడేలగా పర్యవేక్షిస్తామని, సదరు వ్యక్తులపై రౌడీ షీట్లలను ఓపెన్ చేయిస్తామని జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. ఏలూరు జిల్లాలో మహిళలు చిన్న పిల్లలపై అఘాయిత్యం చేసే కేసులలో ప్రత్యేక సెల్ ను ఏర్పాటు చేస్తామని ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కేసులోని ముద్దాయిని అరెస్టు 6వ తేదీన హనుమాన్ జంక్షన్‌లో ముద్దాయిని అరెస్టు చేసి, దొంగిలించిన సెల్ ఫోన్ స్వాదీన పరచు కున్నారు.ఈ కేసులో వెంటనే ముద్దాయిని అరెస్ట్ చేసిన డిఎస్పీ ఈ.శ్రీనివాసులుని, నూజివీడు రూరల్ సర్కిల్ సీఐ కె. రామ కృష్ణ ని, నిడమర్రు సిఐ సుభాష్, భీమడోలు సిఐ బి రవి కుమార్ ,ఇన్స్పెక్టర్ ప్రభాకర్ ఏలూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్, నూజివీడు రూరల్ పీఎస్ . ఎస్ఐ,ఆర్.మల్లికార్జునరెడ్డి, సిబ్బందిని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ అభినందించారు.

# ఆదివాసీ దినోత్సన్ని వైభవంగా నిర్వహించాలి




## కె.ఆర్.పురంలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

**బుట్టాయిగూడెం, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.కోటరామచంద్రాపురంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ ఆవరణలో ఈనెల 9వ తేదీన జరగనున్న అంతర్జాతీయ ఆది వాసీ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే చిర్రి బాల రాజు, ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డిలతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గిరిజన హక్కులపై అవగాహన కలిగించేందుకు ప్రతీ ఏటా ఆగష్టు, 9వ తేదీన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనమండలి సభ్యు లు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రభృతులు పాల్గొంటారన్నారు.ఆదివాసీ దినోత్సవ నిర్వహణలో ఎటువంటి పొరపాటు లేకుండా సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కోటరామచంద్రాపురంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అనంతరం కురసకన్న ప్పగూడెం, రాజా నగరంలలో కలెక్టర్ పర్యటించారు.

కలెక్టర్ వెంట ఐటిడిఏ ఇంచార్జి ప్రాజెక్ట్ అధికారి జి. శ్రీనుకుమార్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె. అద్దయ్య , గిరిజన సంక్షేమం ఇంచార్జి డిడి పి. వి.ఎస్. నాయుడు, ఈఈ కుమార్, కార్యాలయ మేనేజర్ ప్రకాష్, ఇంచార్జి తహసీల్దార్ రమేష్, ప్రముఖులు బొరగం శ్రీనివాస్, కరాటం సాయి, ప్రభృతులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే నాయకర్



**నర్సాపురం,మేజర్‌న్యూస్:** పట్టణంలోని స్టీమర్ రోడ్లో ఆధునీకరణ చేపడుతున్న అన్న క్యాంటీన్ పనులను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలందరికీ ఐదు రూపాయలకే భోజనం పెట్టాలని తెలుగుదేశం ప్రభుత్వం ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని అన్నారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దుచేసి పేదలకు అన్యాయం చేసిందన్నారు. మరల రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా పేదల కోసం అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆగస్టు 15న రాష్ట్రంలో 100 అన్న క్యాంటీన్లను ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు. నరసాపురంలో ఈనెల 15న ప్రారంభం అవుతుందని నాయకర్ అన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు, దొండపాటి స్వాములు, పొన్నాల నాగబాబు, బందెల రవీంద్ర, సంకు భాస్కర్ నాయుడు, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి పార్థసారథి




**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని చొప్పరమెట్ల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,గ్రామ సర్పంచ్ కూరాకుల ఊర్మిళ భర్త సాంబశివ పంగిడేశ్వరరావు సోమవారం గుండెపోటుతో మరణించగా, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు.వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ,నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మంత్రి సారథి మాట్లాడుతూ కుటుంబసభ్యులకు,గ్రామానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల,గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ స్వామివారిని దర్శించుకున్న తెలంగాణ ఎన్నికల కమిషనర్



**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** తెలంగాణా రాష్ట్ర ఎన్నికల కమీషనర్ సి.పార్థసారథి బుధవారం కుటుంబ సమేతంగా ద్వారకా తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు.ముందుగా ఆలయానికి చేరుకున్న పార్థ సారథికి ద్వారకాతిరుమల మండల డిప్యూటీ తహసీల్దార్ పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. అనంతరం శ్రీ వెంకటేశ్వరరాస్వామి దేవాలయంలో.ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో పార్థసారథికి స్వాగతం పలికారు. అనంతరం శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదాశీర్వచన మండపంలో వేదపండితులు పార్థసారథికి,కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం చేశారు.ఆలయ అధికారులు పార్థసారథిని దుశ్శాలువాతో సత్కరించి, శ్రీవారి చిత్రపటాన్ని, స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. ఆలయ డిప్యూటీ ఏఈఓ ఎం. దుర్గారావు, ఆలయ అధికారులు నటరాజన్, మద్దాల శ్రీనివాస్, ఆలయ ప్రోటోకాల్ అధికారి అప్పన్న, రెవిన్యూ సిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు. అనంతరం పార్థసారథి కారులో ద్వారకా తిరుమల నుండి సూర్యాపేట బయలుదేరి వెళ్లారు.

### వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరించాలి

**ఉద్యోగులు, యువతకు ఎమ్మెల్యే అంజిబాబు సూచన**



**భీమవరం,మేజర్‌న్యూస్:** యువత, ఉద్యోగులు వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరించాలని, చేనేతకు జీవం పోయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం పద్మశాలి సంఘం, కరికాల సంఘం, దేవాలయ సంఘం అధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 10వ జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ చేనేత ఒక కళాత్మకమైన పరిశ్రమ అని, మన రాష్ట్రంలో ఉప్పాడ, మంగళగిరి, చీరాల,పెడన,పొందూరు,ఎమ్మిగనూరు, వెంకటగిరి చేనేత వస్త్రాలకు ప్రతీకలుగా ఉన్నాయని అన్నారు.రాష్ట్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం కచ్చితంగా చేనేత పరిశ్రమకు ఈ రంగంపై ఆధారపడ్డ నేతన్నలకు భరోసా ఇస్తుందని, ప్రజలు సైతం ఈ రంగానికి ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, సంఘం అధ్యక్షులు టిడివి శివప్రసాద్, ఉపాధ్యక్షులు జ్ఞానపాటి మధుసూదన్ రావు, కార్యదర్శి జి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ కే.లక్ష్మణ్ స్వామి,పైపురి సతీష్, ఎస్ సత్యనారాయణ, కరాచీ సత్యవేణి, ఎం శ్రీనివాసులు, కాపా త్రినాథ్, డి.కుమార్ స్వామి పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
పశ్చిమ గోదావరి
గురువారం,
8 ఆగస్టు 2024
2

# సంపద సృష్టి కేంద్రాలు అందుబాటులోకి తేవాలి



**డివిఎల్‌పిఓ యుఎస్ఎస్ శ్రీనివాస్**

**నరసాపురం,మేజర్‌న్యూస్:** గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్త ద్వారా సంపద సృష్టించే కేంద్రాలను నిర్వహణలోకి తీసుకురావాలని డివిజనల్ పంచాయితీ అధికారి యు ఎస్ ఎస్ శ్రీనివాస్ అన్నారు. బుధవారంస్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ సర్పంచులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల విస్తరణ అధికారి ఆంజనేయ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డి ఎల్ పి ఓ మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో షెడ్లు, చెత్త సేకరణ వాహనాలు పాడైపోయినవని 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా పంచాయితీ తీర్మానం చేసి, వాటిని బాగు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. నివాస ప్రాంతాల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకారం అందించాలని, సర్పంచులు, కార్యదర్శులు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. సెప్టెంబర్ 15 నాటికి వాటన్నింటిని అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాదం, ఎర్వర్ట్, ఏఈ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే నాయకర్



నర్సాపురం రూరల్, మేజర్‌న్యూస్ :మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో 20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు, వేములదివి ఈస్ట్‌లో నిర్మిస్తున్న 30 లక్షల రూపాయలరోడ్డు పనులకు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ బుధవారంభూమి పూజ చేశారు. మంగళ వారం జరిగినఈకార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడు తూ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కృషి చేస్తానని అన్నారు. నియోజకవర్గ తెలుగుదేశం పొత్తూరి రామరాజు , పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# దేశ భక్తిని పెంపొందించే విధంగా స్వాతంత్ర్య వేడుకలు

**జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** దేశ భక్తిని పెంపొందించే విధంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారంస్వాతంత్ర్య దినోత్సవవేడుకలనిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈనెల 15వ తేదీ ఉదయం 9 గంటల నుండి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వేడుకల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రమంత్రివర్యులుజాతీయజెండాను ఆవిష్కరిస్తారని, అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారన్నారు. జిల్లాలో అమలు జరుగుతున్నాసంక్షేమ,అభివృద్ధి పథకాలపై మంత్రివర్యులు సందేశమిస్తారన్నారు. అనంతరం దేశభక్తిని పెంపొందించే విధంగా పాఠశాల విద్యార్థినీవిద్యార్థులచేసాంస్కృతికకార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరంజిల్లాలోఅమలుజరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే విధంగాశకటాల ప్రదర్శన నిర్వహించాలన్నారు. అనంతరం వివిధ శాఖలచే అమలు జరుగుతున్న కార్యక్రమాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లాలో ముందుగా ప్రతీ ప్రభుత్వ కార్యాలయం పై జాతీయ జెండా ఎగిరేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా ప్రజలలో చైతన్యం



తీసుకురావాలన్నారు. జిల్లా,మండల స్థాయిలో ర్యాలీలు నిర్వహించాలని, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు స్వాతంత్ర సంగ్రామం, దేశానికీ స్వాతంత్రం సముపార్జనకు కృషిచేసిన త్యాగధనుల జీవితాలపై వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి డి.పుష్పమణి,ఆర్డీఓ ఎన్.ఎస్.కె.ఖాజావలి,డిఈఓ అబ్రహం, ఆర్ఐఓ చంద్రశేఖర్, డీఆర్డీ ఏపీడీవిజయరాజు, డిపిఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాధ్, డ్వామా పీడీ పిరాము,ఉప రవాణా కమీషనర్ శాంతికుమారి, డిసిహెచ్ ఎస్ జిల్లావైద్యఆరోగ్యశాఖాధికారి డా.నాగేశ్వరరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

# 17 నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రము ద్వారకా తిరుమల చిన్న వెంకన్న ఆలయం లో నేటి నుండి 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు శ్రీ స్వామివారి పవిత్రోత్సవాలు జరుగనున్నాయి అన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు జరిగే నాలుగు రోజులు స్వామివారి ఆర్జిత సేవలు నిలిపి వేయనున్నట్టు ఈఓ తెలిపారు. ఆలయంలోస్వామివారిక జరిగే పూజ,సేవా కార్యక్రమాలలో తెలిసి తెలియక చాలా తప్పులు జరగవచ్చు కొందరు భక్తులు పురుడు బహిష్ట సమయాల్లో కూడా ఆలయ ప్రవేశం చేసే అవకాశం ఉంటుంది వాటి కారణంగా కలిగే దోష పరిహారం కోసం తెలియక జరిగే తప్పుల ప్రాయశ్చిత్తం నిమిత్తం ప్రతి ఏటా ఈ పవిత్రోత్సవాలను చేపడుతారు.

ఈ పవిత్రోత్సవాల సమయంలో స్వామివారిని దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం అందుకే ఈ పవిత్ర ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలను ఆనవాయితీగా చేస్తారని ఆయిన పేర్కొన్నారు.

# స్కూలు మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు

**విధివిధానాలు వెల్లడించిన ఎంఈవో భాస్కర్ కుమార్**



**భీమడోలు,మేజర్‌న్యూస్:**భీమడోలు మండలంలోని 44ప్రభుత్వ పాఠశాలల్లో స్కూలు మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలను ఎన్నికల నియమావళి మేరకు నిర్వహిస్తామని భీమడోలు మండల విద్యాశాఖాధికారి భాస్కర్ కుమార్ తెలిపారు.

ఏలూరు జిల్లాలో ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా, మండల విద్యాశాఖాధికారులు ఎన్నికల నోటిఫికేషన్ ను ఈనెల 1తేదీన విడుదల చేశారు. ఈమేరకు ఓటర్ల జాబితాను విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఈసందర్భంగా భీమడోలు ఎంఈవో భాస్కర్ కుమార్ బుధవారం భీమడోలు హైస్కూల్‌ని సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లను ప్రధానోపాధ్యాయులు అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేసారు. ఈసందర్భంగా ఎంఈవో భాస్కర్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 8 వతేది గురువారం భీమడోలు మండలం లోని మొత్తం 44 మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు జరగనున్నాయని, ఎన్నికల్లో ఎన్నుకోబడిన కమిటీలు ద్వారా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, అభివృద్ధి జరుగుతుందన్నారు. పాఠశాల లోని విద్యార్థుల తల్లిదండ్రులలో ఒకరు ఓటు హక్కువినియోగించుకోవడానికి పాఠశాలకు వచ్చి ఎన్నికల్లో పాల్గొనాలని, ఇప్పటికే అన్ని పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడం జరిగిందని, ఎన్నికల విధి విధానాలను ఎంఈవో భాస్కర్ కుమార్ వెల్లడించారు.

# ముర్రుపాలు బిడ్డకు ప్రకృతి ప్రసాదించిన వరం




ముదినేపల్లి,మేజర్‌న్యూస్ : ముర్రుపాలు బిడ్డకు ప్రకృతి ప్రసాదించిన వరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రసన్న అన్నారు. తల్లిపాల ముగింపు వారోత్సవాలు కొర్రగుంటపాలెంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలుబిడ్డకు వ్యాధినిరోధకశక్తిని అందిస్తుందన్నారు. బిడ్డ బిడ్డకు మధ్య ఎడం ఏర్పడుతుందన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ నాగలక్ష్మి , ఏఎన్ఎమ్ కృప సంతోషి బాయ్,ఎంఎల్‌హెచ్‌పి అంబికా ,అంగన వాడి కార్యకర్తలు శివనాగమణి,శ్రీలక్ష్మి,శ్రీదేవి, పాండురం గమ్మ, అరుణకుమారి, ఆశావర్కర్లు పరిశుద్ధం,వసుంధర పాల్గొన్నారు.

# టిస్పర్ష్ పృథ్వి టయోటా కార్ షోరూమ్

**ప్రారంభించిన ఎమ్మెల్యే బడేటి చంటి**

**ఏలూరు, మేజర్ న్యూస్ :**ఎంఆర్‌బి ఆటో లైఫ్ ప్రైవేట్ లిమిటెడ్ పృథ్వీ టయోటా షోరూం ప్రారంభమైంది. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి) షోరూమ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ ప్రతిష్టాకరమైన టయోటా టిస్పర్శ కార్ షోరూంను ఏలూరులో ప్రారంభించడం టయోటా కార్ల అభిమానులకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఇదిఒకనూతన అధ్యాయానికి ప్రారంభమన్నారు. పృధ్వి టయోటా షోరూంతమ ఖాతాదారుల అభిమానాన్ని పొందాలని,ఖాతాదారులకు ఉత్తమమైన సేవలను అందించాలని ఆకాంక్షించారు. ఏలూరులోని పృథ్వీ టయోటా నూతన కార్ షోరూమ్ లో టయోటా సంస్థకు చెందిన ఇన్నోవా, ఫార్చునర్, హై రైడర్, గ్లాంజా, రోమియాన్ తదితర కార్లు అందుబాటులో ఉంటాయి. తొలుత పృధ్వి టయోటా సంస్థ చైర్మన్ ఎం రమేష్ బాబు,ఎండి ఎం పూర్ణచంద్ర పృధ్వి,సీఈఓ పి కిరణ్ కుమార్ షోరూం ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులకు సాదర స్వాగతం పలికారు. టయోటా సంస్థ తరపున మహారాట్ సాన్, నిఖిల్ సాన్, శశికాంత్ సాన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహారాట్ సాన్ మాట్లాడుతూ టయోటా




సంస్థషోరూమ్‌లలో ఏలూరు షోరూం నాలుగవది అన్నారు. తొలుత రాజమండ్రి,కాకినాడనగరాల్లోప్రారంభించామని, బుధవారం ఉదయం తణుకులో, సాయంత్రం ఏలూరులో ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. గురువారం భీమవరంలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.ఆర్.డి. బలరాం,పూజారి నిరంజన్,అమరావతిఅశోక్,ఆర్నెపల్లి తిరుపతిరావు, నగరంలోని ప్రముఖ వ్యాపారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

# బిందు, తుంపర్ల సేద్యానికి రాయితీపై పరికరాలు



**భీమవరం, మేజర్ న్యూస్:** బిందు, తుంపర్ల సేద్యంకు రాయితీపై పరికరాలు పొందేందుకు ఆసక్తి కలిగిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి మేలు చేసేలా అందుబాటులో ఉన్న సాగు నీటి వనరులను సద్వినియోగం చేసుకుని బిందు, తుంపర్ల సేద్యమునకు సంబంధించి పరికరాలను సబ్సిడీతో ఇచ్చి ప్రోత్సహిం చేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ పథకం కింద అన్ని రకాల పండ్లు, కూరగాయలు, పూల తోటలకు రాయితీపై బిందు తుంపర్ సేద్య పరికరాలను అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాకు 2023-24 సంవత్సరానికి 500 హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, గత ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేయించుకుని పరిపాలన ఉత్తర్వులు పొందని రైతులు ఈ సంవత్సరం మరల రిజిస్ట్రేషన్ ను చేయించుకోవాల్సిన అవసరం లేదన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియపై రైతులకు అవగాహన చేకూర్చడంలో వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖల మండల అధికారులు సమిష్టిగా పని చేయాలని, అలాగే సచివాలయాలలో వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖలకు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్లు కూడా లక్ష్యాలను పూర్తి చేసేందుకు భాగస్వాములు కావాలన్నారు. రైతులు పరికరాల కోసం ఆధార్ కార్డు, భూ యాజమాన్య పత్రం, బ్యాంకు ఖాతా, ఫోటోలు తీసుకుని దగ్గర్లోని ఆర్బికెల్లో ఉన్న గ్రామ ఉద్యాన సహాయకులు, వ్యవసాయ సహాయకులకు సమర్పించాలన్నారు. బిందు, తుంపర సేద్యం ద్వారా నీరు, ఎరువులు, కూలి ఖర్చులు ఆదాతో పాటు, దిగుబడి అధికంగా ఉంటుందన్నారు.

# చేనేత అభివృద్ధికి సహకారం ఇవ్వాలి





**భీమవరం, మేజర్ న్యూస్:** జిల్లాలో చేనేతను ప్రోత్సహించేందుకు ప్రజలు చేనేత వస్త్రాలను ధరించడంతోపాటు, వాటిని ధరించడంలో వున్న సౌలభ్యంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు,బుధవారం స్థానిక డిఎన్ఆర్ కళాశాల సిల్వర్ జూబ్లీ సమావేశం మందిరం నందు జిల్లా చేనేత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 10వ జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో చేనేత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. చేనేత వస్త్రాలు కొనుగోలు ద్వారా చేనేత కార్మికులను ప్రోత్సాహం లభిస్తుందన్నారు. వస్త్రాలు ధరించడంలో సౌలభ్యంతో పాటు, ఆరోగ్యపరంగా కూడా మంచి చేకూరుతుం దన్నారు. ప్రపంచవ్యాప్తంగా 95 శాతం చేనేత ఉత్పత్తులు మన దేశం నుండే ఉన్నాయన్నారు. స్వదేశీ ఉద్యమంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులు చేనేతకు మంచి ఆదరణ తీసుకొచ్చారని, కాలం గడిచిన కొద్ది యంత్రాల మీద తయారయ్యే వస్త్రాలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. నేటి యువతకు చేనేత వస్త్రాల గురించి పెద్దలు చెప్తే గానీ తెలియని విషయంగా మారిందన్నారు. మగ్గంపై చేనేత వస్త్రాలు దశలవారీగా ఎలా తయారు చేస్తారో విద్యార్థులు స్వయంగా పరిశీలిస్తే అవగాహన వస్తుందన్నారు. చేనేత వస్త్రం తయారీలో కార్మికుల కష్టం చాలా ఎక్కువ ఉంటుందని, ఒక విధంగా చెప్పాలంటే ఆ వస్త్రాలకు మనం చెల్లించే ఖరీదు తక్కువే అన్నారు. ఇప్పటికే మన రాష్ట్ర ముఖ్యమంత్రి చేనేత అభివృద్ధికి ఆలోచన చేస్తున్నారని, త్వరలో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. చివరిగా సిద్ధాని విఘ్నేశ్వర రావు, సమతం చిన్న సముద్రం లింగం ఇద్దరు చేనేత కార్మికులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా శాలువాను కప్పి పూలదండ వేసి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ డెవలప్మెంట్ ఆఫీసర్ బి.రామయ్య, ఏడిఓ జి.గుర్రాజు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనరు చెరుకువాడ రంగసాయి, డియన్ఆర్ కళాశాల అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహారాజు, వైస్ ప్రెసిడెంటు గోకరాజు పాండు రంగరాజు, చేనేత కార్మికులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణదేవరాయని పాలనలో మత సామరస్యం



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయ పాలనలో మత సామరస్యంతో సకల జనులు సుఖసంతోషాలతో అన్నదమ్ములు వలే ఉండేవారని శ్రీ కృష్ణదేవ రాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకట రత్నం అన్నారు. శ్రీ కృష్ణదేవరాయులు "515"వ పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా ..పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్లో వున్న " శ్రీ కృష్ణదేవరాయల విగ్రహానికి" పూలమాలలతో ఘన నివాళులు అర్పించారు. తెలుగు రాష్ట్రాలలో పట్టాభిషిక్తులైన పాలకులు ..వ్యక్తిగత అజెండాలు ప్రక్కన పెట్టి తెలుగు ప్రజల సమగ్రఅభివృద్ధి,సంక్షేమమే ప్రధానధ్యేయంగా ..పని చేసి ప్రపంచానికి తెలుగు భాష గొప్పతనం చాటి చెప్పిన రాయలలా...కీర్తించబడాలని సుంకర గణేష్,పినిశెట్టి శ్రీనివాస్, మండేల ఫణి నాథ్, రాయి సూరి బాబు, గుండుమోగుల వీరాస్వామి,యడ్ల మరళీ, పూలపల్లి సందీప్, యర్రంశెట్టి రతన్ జీ,యర్రంశెట్టి మోక్షిత తదితరులు పేర్కొన్నారు.

# శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న టౌన్ సిఐ



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:**టౌన్ సీఐగాబాధ్యతలు స్వీకరించే ముందు శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న కోలా రజనికుమార్,భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు, ఈయన వెంట ఏఎస్ఐ శివాజీ, రంగయ్య నాయుడు, హోంగార్డుల సిసి ఎం ఎస్ నాయుడు, ఆలయ సూపరిండెంట్ మండే స్వామి, గాదే సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ శ్రీకాకుళం వెంకన్న తదితరులు పాల్గొన్నారు,

# శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు గోపాలకృష్ణారావు, పార్థసారథి





**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చిన్న వెంకటేశ్వర స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి వి.గోపాలకృష్ణరావు దంపతులు ,తెలంగాణ స్టేట్ రిటైర్డ్ ఎలక్షన్ కమిషనర్ సి పార్థసారథి దంపతులు బుధవారం ఉదయం ఆలయానికి విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు అర్చకులు తూర్పు గోపరము వైపు పూర్ణకుంభం స్వాగతం పలుకుగా స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయము మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనాలు పలికి స్వామివారి శేష వస్త్రాన్ని ప్రసాదాలను సమర్పించారు. దేవాలయ డీఈవో, ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, నటరాజు స్వామి వారి జ్ఞాపికను అందించారు.

# వై.ఎన్. కళాశాలలో డ్రగ్స్ నివారణపై అవగాహన




**నరసాపురం,మేజర్‌న్యూస్ :** స్థానిక శ్రీ వై.ఎన్.కళాశాల ఐ.క్యూ.ఎ.సి., సామాజిక సేవా కేంద్రం,ఎన్.ఎస్.ఎస్. సంయుక్త ఆధ్వర్యంలో 'మాదక ద్రవ్యాలు పొగాకు నివారణ'అనే అంశముపైఅవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నర్సాపురం సర్కిల్ ఇన్ స్పెక్టర్ బి.యాదగిరి విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, 'నేడు యువత అంతా మాదక ద్రవ్యాల వాడకం ఎక్కువగా చేస్తుందని, దానిద్వారా వారి భవిష్యత్తు ను వాళ్ళ చేతులతో వాళ్ళే నాశనం చేసుకుంటున్నారని, క్షణికానందం కోసం మీరు తీసుకునే మాదక ద్రవ్యం వల్లమీతల్లిదండ్రులను, కుటుంబ గౌరవాన్ని సమాజంలో దిగజార్చిన వారవుతున్నారని అన్నారు. మీరు చేసే పనులవల్ల సమాజంలో జరిగే హానికరమైన ప్రభావాలు, తద్వారా వచ్చే దుష్ప్రభావాల గురించి వివరించి, మీ చుట్టుప్రక్కల ఎక్కడైనా మాదక ద్రవ్యాల అమ్మకం లేదా వాడకం జరుగుతున్నట్లైతే మాకు సమాచారాన్ని అందించినట్లైతే మేము తగిన చర్యలు తీసుకుంటా మనిఅన్నారు. అక్రమ మాదక ద్రవ్యాల వ్యాపారం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా సీనియర్ అడ్వకేట్ యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్ మాట్లాడుతూ, 'ఎన్.డి.పి.ఎస్.యాక్ట్ సెక్షన్ 27ప్రకారం మాదకద్రవ్యాలను కలిగిఉన్నా, తీసుకున్నా, అమ్మినా, పెంచినా, రవాణా చేసినా, నిల్వ చేసినా కనీసం ఆరు నెలల జైలు శిక్ష, రుసుము చెల్లించ వలసి ఉంటుంది. కావున మీరంతా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, మీ భవిష్యత్తును బంగారు మాయం చేసుకోవాలని' అన్నారు. అకడమిక్ అడ్వైజర్‌రిటైర్డ్ సైంటిస్ట్ ఆర్.వి.సుబ్బారావు సీనియర్ రిటైర్డ్ డాక్టర్ ఎల్.రాజేంద్ర ప్రసాద్ విధ్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.చింతపల్లి కనకారావు, పి.జి.డైరెక్టర్ డా. నిమ్మల చింతారావు, డీన్ డా.గంధం శ్రీరామకృష్ణ, రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయకర్త యనుముల సతీష్, హెచ్.ఆర్.డి డైరెక్టర్ డా.చినిమిల్లి శ్రీనివాస్, సామాజిక సేవా కేంద్రం సమన్వయకర్త బి.ఎన్.ఎస్.వి.ప్రసాద్, ఎన్.ఎస్.ఎస్. ఆఫీసర్లు యాకోబు, సోమేశ్వరి, మహిళా సాధికార విభాగ సమన్వయకర్త డా.కె.వి.ఆర్.బి. వరలక్ష్మి, వై.వెంకటేశ్వరరావు,పుప్పాల వీరాస్వామి, లక్ష్మీ దేవి, ఎన్.సి.సి.ఆఫీసర్ రమణరామారావు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న సీడ్ కంపెనీల మోసాలు అరికట్టాలి

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్**



**ద్వారకాతిరుమల, మేజర్ న్యూస్:** మొక్కజొన్న సీడ్ కంపెనీల మోసాలు అరికట్టాలని, సిహెచ్ పోతేపల్లి, తూర్పు ఎడవల్లి గ్రామాలలో మోసపోయిన సీడ్ మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ద్వారకాతిరుమల లోని యుటిఎఫ్ హాలులో సీడ్ మొక్కజొన్న కంపెనీల మోసాలపై ఆయన మాట్లాడారు. జిల్లాలో మొక్కజొన్న కంపెనీల మోసాలకు రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీల నుండి రైతులకు ఎటువంటి అగ్రిమెంట్స్ ఇవ్వకపోవడం వలన రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. మొక్కజొన్న కంపెనీల మోసాలు అరికట్టేందుకు ప్రభుత్వాలు వైపు నుండి తగిన చర్యలు ఉండడం లేదన్నారు. దీంతో కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. సిహెచ్ పోతేపల్లి,తూర్పు ఎడవల్లి 130 ఎకరాలలో సీడ్ మొక్కజొన్న సాగుచేసిన రైతులకు నకిలీ విత్తనాలు ఇవ్వడం వలన దిగుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. నకిలీ విత్తనాలతో రైతులను ముంచేయడం దారుణమని విమర్శించారు. రైతులు చెప్పిన దిగుబడులకు అనుగుణంగా సొమ్ములు ఇప్పించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులు చేస్తున్న ఆందోళనలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున సంఘీభావం ప్రకటించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.